# మాతృత్వానికి మరోముడి



వల్లభు విజయలక్ష్మి

జీవితంలో ఎన్నడూ విమానం కూడా ఎక్కని మనిషి వున్నట్టుండి రాకెట్లో చంద్ర మండలానికి వెళ్ళవలసి వస్తే కలిగే భయం, ఉద్వేగం నాలో కలుగుతున్నాయి. భయానికి పరాకాష్ఠ స్తబ్ధత అయి

నట్లు, శరీరం, మెదడు రెఫ్రిజిరేటర్లో పెట్టినట్టు గడ్డ కట్టుకుపోతున్నాయి.

బస్సు కదులుతోంది. ఏవేవో పెద్ద పెద్ద బిల్డింగులు కదిలిపోతున్నాయి. కాని మొద్దుబారిన మెదడు అవేవీ గమనించే స్థితిలో లేదు. పక్కనే కూర్చున్న శ్రీను ఇబ్బందిగా చూస్తున్నాడు. వాడికి నేనంటే ఎంతో అభిమానం. అక్కయ్యకు ఆరోగ్యం సరిగ్గా లేక దాదాపు ఏడేళ్ళు వుంటే నా పెళ్ళయే వరకు నా దగ్గరే పెరిగాడు. గత అయిదేళ్ళుగా 'మద్రాసు రా పిన్నీ' అని ఎంత బతిమాలినా రానిదాన్ని, ఉన్నట్లుండి టెలిగ్రాం ఇచ్చి రావడం ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కలిగిస్తే 'అక్కయ్యకు సుస్తీగా వుందని' అబద్ధం చెప్పి వచ్చానని తెలియగానే అనుమానాన్ని కూడా రేకెత్తించి వుంటుంది. శ్రీనుకి పాతికేళ్ళయినా లేవుగాని చదువు, సంస్కారం వున్నవాడు. లేకపోతే నేను క్రితం సాయంత్రం బీచ్‌లో కోరిన కోరికకు కారణం ఏమిటని నేపుకు తినాల్సిందే. మరో ప్రశ్న వేయకుండా ఇంట్లో అష్టలక్ష్మి గుడికి తీసుకెళుతున్నానని అబద్ధం చెప్పి పొద్దుటే నన్ను బయటకు తీసుకు వచ్చాడు.

నాకు అరవం అసలు రాదు. ఇంగ్లీషు కూడా అంతంత మాత్రం. అలాంటిది ఓ ఫైవ్ స్టార్ హోటల్లో నన్ను ఒంటరిగా వదిలి వెళ్ళడానికి సంకోచించడంలో అతడి తప్పేమీ లేదు. కాని నేను ఇంత దూరం ఇంత కష్టపడి వచ్చింది ఈ ఒక్క గంట కోసమే.

"పక్క స్టాపులోనే దిగాలి పిన్నీ" శ్రీను మాటలకు ఆలోచనల్లోంచి తేరుకున్నాను. అంతలోనే పరీక్షకు సమయం దగ్గర పడుతోందన్న ఆలోచనతో గుండెల్లో గాభరా, యాంత్రికంగానే బస్సు దిగి శ్రీను వెంట నడిచాను.

"ఇదే పిన్నీ సవేరా హోటల్" గేటుదగ్గర ఆగి చూపించాడు.

"సరే బాబు, నువ్వెళ్ళి ఓ గంట, గంటన్నర తర్వాత రా. నేను లేకపోతే ఇక్కడే వెయిట్ చెయ్యి" అన్నాను.

"అలాగే పిన్నీ నువ్వు మాత్రం ఒంటరిగా ఎటూ వెళ్ళకు. త్వరగా వస్తే ఇక్కడ వుండు" చెప్పి వెళ్ళిపోయాడు. అతడు కనుమరుగయే

## మనిషి రక్తం తాగకురో

రాజుల కోసం రణరంగాలలో
కత్తుల కేరింతల నెత్తుటి మడుగులలో
అమరులు బాసిన అజ్ఞాత వీరుల్ని తలచుకుని
పాడులోకం పాడు రాజులని అనుకున్నాను

తరువాత కాలంలో బాంబులు పేలాయి
తళ తళ మెరిసే ఖడ్గాలకు మారుగా
నేల పొరల్లో కనిపిస్తున్న కంకాళాలు చూసి
పాడు లోకం పాడు మనుషులని అనుకున్నాను

నేడు నా కళ్ళల్లో మసులుతున్నారు
నిహతులైన నిర్భాగ్యులెందరెందరో
ధన మదాంధుల దారుణ కోపానలానికి
శలభాలైన సామాన్యులూ అసామాన్యులూ

మారణాయుధాలు విభిన్నాలు కావచ్చు
వీర స్వర్గ మలంకరించిన యోధాగ్రేసరులూ
హత్యలను సైతం వికృతంగా మార్చినారూ
మరెవరో కాదు, మానవులే, సాటి మానవులే

అవిచ్ఛిన్నంగా సాగుతున్న యీ జనహత్య
ఆగే సూచన లైనా కనిపించడం లేదే,
రాజులు పోయినా రోజులు మారినా
విజ్ఞాన భానుడు కాంతులు వెదజల్లుతున్నా

హింస పాపకారణమన్న ప్రేమ మూర్తులు
మోహాల వర్జించమన్న త్యాగ శీలురు
నిహతులు నిహంతలు మలినాత్ములు మహనీయులు
అందరూ ఒక్క తానులోనివారే, అయినా భేదాలు!

'మానవ జన్మం పవిత్రమైనా, మనిషి రక్తం తాగకురో
పారబోసిన మాంసం తింటే పొట్ట పగిలిపోతుందో'
అన్నాడు గాంధేయ కవి గరిమెళ్ళ
నిన్నటికీ పరమ సత్యమే యీ సూక్తి!

— చల్లా రాధాకృష్ణ శర్మ

వరకు అలాగే చూస్తూ నిలబడ్డాను.

శ్రీనులో 'మరో రకమైన' అనుమానం కలిగే ఆస్కారం లేదు. నలభయ్యో పడిలో పడబోతున్న దాన్ని ముగ్గురు పిల్లల తల్లిని, మరే రకమైన ఆకర్షణ అసలు లేనిదాన్ని.బహుశా ఏ సినీ నటినో కలవడానికి వచ్చానని, అది చెప్పుకోవడానికి సిగ్గు పడుతున్నానని అనుకుంటాడు. 'ఎవరేమనుకుంటారో'ననే సామాన్యమైన ఆలోచనకి ప్రాధాన్యత ఇవ్వలేని అవసరం ఇది.

నా జీవితం అతి సాధారణమైంది. బీద కుటుంబంలో మూడో అమ్మాయిగా పుట్టాను. నాన్న స్కూల్ టీచర్. నాకు కాస్తన్నా ఇంగ్లీషు పరిజ్ఞానం అలవడడానికి, మాట్లాడగలగడానికి ఆయన ఇంగ్లీషు టీచర్ కావడమే కారణం. నాకు చదువు మీద ఎన్నడూ శ్రద్ధ లేదు. 'ఉద్యోగాలు చేయాలా, ఊళ్ళేలాలా' అన్న ధోరణిలోనే పెరిగాను. ఏడో తరగతి ఫెయిలవగానే చదువు మాన్పించి నాన్న నాకు పెళ్ళి చేశాడు. నా భర్త ఓ గుమస్తా. ఒక బీద స్కూలు టీచర్ మూడో కూతురుకి అంతకంటె మంచి సంబంధం తేలేదు కదా. పెళ్ళయిన రోజు నించి ఈ రోజు వరకు, బహుశా ఇక జీవితమంతా కూడా ఏ రోజుకారోజు, ఏ నెల కానెల ఎలా గడుస్తుందో అన్న ఆలోచనతోటే గడిచిపోతుంది. నడిసముద్రంలో నావ లాంటి జీవితం అన్నమాట. వదులుకోలేని దాన్ని అలవాటుగా మార్చుకోమన్నారు. అందుకే ఆ జీవితానికి అలవాటు పడిపోయాను. ఇన్నేళ్ళ జీవితంలో నా కోసం నేను, నా సంతృప్తి కోసం చేస్తున్న మొదటి సాహస కార్యం ఇది. ఏ వయసులోనూ ఏదో 'థ్రిల్' కావాలని కలలో కూడా అనుకుని ఎరగను. అలాంటిది ఈ వయసులో పురి విప్పిన ఈ కోరిక, అణచుకోలేని ఆరాటం ఎవరికైనా నవ్వు తెప్పించేవిగానే వుండొచ్చు. జీవించడం కోసమే జీవించే నాలాంటి వాళ్ళకు జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక సమయంలో ఓ చిన్న అడ్వెంచర్ చెయ్యాలనిపించడం తప్పు కాదనుకుంటాను.

చేతిలో ప్యాకెట్టు పట్టుకుని ఎదురుగా కనిపిస్తున్న ద్వారంలోకి అడుగు పెట్టాను. చాలా పెద్ద హాలు ఒక పక్కగా కౌంటర్లో రిసెప్షనిస్టు కూర్చుని ఫోన్లో మాట్లాడుతోంది. తడబడే అడుగులతో దగ్గరగా వెళ్ళాను.

"యస్" అంది మౌత్ పీస్‌కి చెయ్యి అడ్డం పెట్టి మామూలు నేత చీరలో అతి మామూలుగా కనిపిస్తున్న నాకు ఈ స్టార్ హోటల్లో ఏం పనా అన్నట్లు అనుమానంగానూ, రవ్వల హారంలో ఓ గాజు పూస కనిపించినంత ఆశ్చర్యంగానూ చూస్తోంది. ఈ రోజు అనుమానాలు, ఆశ్చర్యపోవడాలు చాలా చూడాలనుకుంటాను.

"రూమ్ నెంబర్ రెండు వందల అయిదుకి వెళ్ళాలి" అన్నాను ఇంగ్లీషు సంభాషణకి పునాది వేస్తూ.

"ఓ, మిస్ క్రిస్టీనాని కలవాలా?" అర్థమైందన్నట్టు చూసింది. "అలా వెళ్ళండి. పక్కనే లిఫ్టుంది' ' అంది.

"ఏ అంతస్థు?" అడిగాను.


"రెండో అంతస్థు" ఆమె ముఖంలో నవ్వు 'ఎక్కడిదీ అవతారం' అన్నట్టుగా పట్టించుకోకుండా 'థాంక్స్' చెప్పి అటువైపు నడిచాను. లైఫ్‌లో లిఫ్టు ఎక్కిందే ఒక్కసారి. అప్పుడు పక్కన శ్రీవారున్నారు. ఇప్పుడు 'లిఫ్టులో ఎక్కడానికి భయం' అని చెప్పడానికే భయం.

"నేను చెప్పాను చూడు క్రిస్టీనా అని స్వీడన్ నించి వచ్చిందని, ఓ పాపని పెంచుకోవాలనుకుంటోందని. దానికోసం కాబోలు ఒకపల్లెటూరావిడ వచ్చింది. వార్తలు మూల మూలలకు పాకిపోతున్నాయనడానికి నిదర్శనం కదూ" రిసెప్షనిస్టు ఫోన్లో చెప్తోంది.

కూడ గట్టుకుంటున్న ధైర్యం ఒక్కసారిగా దిగజారిపోతున్న భావం. అడుగులు తడబడ్డాయి. చేతిలో ప్యాకెట్టు జారబోయింది. అమ్మో గట్టిగా గుండెలకు హత్తుకున్నాను. వెంకటగిరి జరీ చీర కొనుక్కోవాలని ఏడాదిపాటు శ్రమపడి దాచుకున్న డబ్బుతో కొన్న వస్తువు.

అదృష్టవశాత్తూ లిఫ్ట్ పక్కనే మెట్లున్నాయి. లిఫ్ట్ దగ్గర అటెండరు వున్నాడు కాని ఒక్క నిముషంలో రెండవ అంతస్థు చేరడం నాకిష్టం లేదు. మెట్లెక్కి పది నిముషాల్లో నన్ను నేను అగ్ని ప్రవేశానికి ఆయత్త పరుచుకోవాలి. ఒక్కొక్క మెట్టు ఎక్కుతున్న కొద్దీ గుండె దడ కొద్ది కొద్దిగా పెరుగుతోంది. రెండో అంతస్థులో ఆ గది ముందు నిలబడే సరికి గుండె వూడిపడిపోతుందేమోనన్నంత వేగంగా కొట్టుకుంటోంది. అలాగే నిలబడిపోయాను.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. వెనక్కు



వెళ్ళిపో' ఇంగితం హెచ్చరిస్తోంది.' ఇంత దూరం వచ్చి వెళ్ళిపోతావా? వద్దు ధైర్యం చెయ్యి. జీవితాంతం మర్చిపోలేని గొప్ప అనుభవాన్ని వదులుకోకు. నన్ను చంపకు' అంటోంది అంతరాత్మ.

పక్క గదిలోంచి వెయిటర్ ట్రేతో బయటకు వచ్చాడు. నేను నిలబడ్డ తీరు అతడిలో అనుమానం రేకెత్తించినట్టు నా మీద నిలచిన అతడి చూపులే చెపుతున్నాయి. అతడు అరవంలో ప్రశ్న వేసే అవకాశం ఇవ్వకూడదని తలుపు మీద దబ దబా బాదేశాను.

"హూ ఈజిట్? కమిన్" స్త్రీదో పురుషుడిదో తెలియని కంఠస్వరం. తలుపు తెరిచి లోపలకు అడుగు పెట్టాను. చేతిలో డోర్ హ్యాండిల్ నేను తూలి పడిపోకుండా ఆసరా ఇస్తోంది.

"ఎవరు. మీరు, ఏం కావాలి?" ఇంగ్లీషులో అడుగుతోందావిడ. గదిలో వంటరిగానే వుంది. టీ తాగుతూ పేపర్ చదువుకుంటోంది.

"మిస్ క్రిస్టీనా" అన్నాను నోరు పెగుల్చుకుని.

"నేనే. రండి కూర్చోండి" అంది చిరునవ్వుతో. మెల్లిగా వెళ్ళి సోఫా అంచున కూర్చున్నాను. పక్కనే మరో గది వున్నట్లు అప్పుడే గమనించాను. నాలో భయాన్ని, ఆందోళనని గ్రహించినట్లుంది. స్నేహపూరితంగా నవ్వింది.

"కొంచెం టీ తీసుకుంటారా?" అడిగింది.

"ఊ" అన్నాను. వేడి వేడి టీ నా టెన్షన్ని కొంతయినా తగ్గించవచ్చును. పాట్ లోంచి టీ కప్పులోకి వొంపి అందించింది. టీ సిప్ చేస్తూ ఆమె వైపు చూశాను. నా కంటె చిన్నదే. చక్కటి గులాబీ రంగు ఒళ్ళు. తేనె రంగు కళ్ళు. కలువ రేకుల్లాంటి అందమైన సొగసైన కళ్ళు కావవి. వెన్నెల నింపుకున్న కళ్ళు మమత ప్రసరించే కళ్ళు.

"నాకు టీ చాలా అలవాటు. అరగంటకో కప్పు తాగుతుంటాను" అంది క్రిస్టీనా అపరిచిత్వాన్ని పరిచితం చేసుకోవడానికి ప్రయత్నం. నాలో లేనిదీ, ఆమెలో వున్నదీ ధైర్యం, కలుపుగోలుతనం. టీ తాగాక నిజంగానే కాస్త తెరిపిన పడ్డాను.

"నేను ఆంధ్రా నించి వచ్చాను. గోదావరి ప్రాంతంలో ఒక టౌను మాది. నా పేరు శాంత" అన్నాను.

"ఆంధ్రా అంటే మీరు మాట్లాడేది తెలుగు భాష కదూ. మా దేశంలో నేను పనిచేసే హాస్పిటల్లో ఒక తెలుగు డాక్టరున్నారు. ఆయన దగ్గర కొద్దిగా తెలుగు నేర్చుకున్నాం" అంది ఉత్సాహంగా.



"అలాగా" నిజంగా సంతోషించాను. ఆంధ్రేతరుడైన ప్రధాన మంత్రి ఒక వాక్యం తెలుగులో అపశృతులతో మాట్లాడితేనే పొంగిపోయే జనాల్లో ఒకదాన్ని కదా. "నేనెక్కువగా చదువుకోలేదు. ఇంగ్లీషు అంత బాగా రాదు" అన్నాను. నేను మాట్లాడుతున్న దాన్లో వ్యాకరణ దోషాలు దొర్లడం నాకే తెలుస్తోంది.

"ఫర్వాలేదు. ఒకరి మనసులో భావాలు మరొకరికి అర్థమయేట్లు చేయడమే భాష పరమార్థం. మీ భావం అర్థమవుతున్నప్పుడు అందులో దోషాలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. చెప్పండి" ఆవిడ స్వరం మారింది. మాటలు విరిచి మెల్లగా, స్పష్టంగా పలుకుతోంది.

"ఒక తెలుగు పత్రికలో మీరిచ్చిన ఇంటర్వ్యూ చదివాను. నన్ను చాలా కదిలించింది. మిమ్మల్ని చూడాలనిపించింది. అందుకే వచ్చాను" అన్నాను.

"తెలుగు పత్రికలోనా? నేను తమిళ పత్రిక్కి ఇంటర్వ్యూ ఇచ్చిన మాట నిజమే. దాన్నే అనువదించి వేసుంటారు. మా అమ్మాయి జెన్నీఫర్ గురించి కూడా రాశారు కదూ?"

"అవును. మీ పాప అదే జెన్నీఫర్ కోసం తెచ్చాను" ప్యాకెట్టు అందించాను. "ఇది చెక్క బొమ్మ. ఏనుగు అంబారీ. కొండపల్లి అని ఆంధ్రాలో ఒక వూళ్ళో చేస్తారు."

"ఓ. థాంక్యూ. జెన్నీ స్నానం చేస్తున్నట్లుంది. తనకి ఇలాంటి వంటే చాలా ఇష్టం. కాని అంతదూరం నుంచి వచ్చారు. సంతోషం. ఈ కానుకలు దేనికమ్మా?"

"అలా అనకండి. ఏదో చిన్న కానుక. నా సంతోషం కోసం"

"మీకెంతమంది పిల్లలు?" అడిగింది క్రిస్టీనా.

"ముగ్గురు" చెప్తుంటే కంఠం వణికింది.

"అందులో ఎవరైనా హేండికాప్ట్ అంటే వికలాంగులు ... సారీ అలా అడక్కూడదనుకుంటాను"

"ఫర్వాలేదు. కాని అలాంటిదేమీ లేదండి. నా ముగ్గురు పిల్లలు ఆరోగ్యంగానే వున్నారు" ఆవిడ అనుమానం అర్థమయింది. రిసెప్షనిస్టులాగా నేను పిల్లని పెంపకానికి ఇవ్వడానికి వచ్చాననుకుంటోంది. ఆవిడ అనుమానం తీర్చాలనిపించింది.

"మా ఎదురింట్లో వాళ్ళకి ఇద్దరు పిల్లలు. అందులో బాబు వికలాంగుడు. నడవలేడు. అన్నీ మంచం మీదే. ఆ ఒక్కడినీ చూసుకోవడానికే వాళ్ళు చాలా అవస్థ పడుతుంటారు. సరైన నిద్ర కూడా వుండదు. వాళ్ళ బాధ చూశాక 'అసలు పిల్లలు పుట్టకపోయినా ఫర్వాలేదు కాని ఇలాంటి బిడ్డలు వద్దు' అనిపిస్తుంది. అలాంటిది మీరు వికలాంగులైన ఒక పాపని పెంచుకున్నారు. మరో పాపని అలాంటిదాన్నే పెంచుకోవాలనుకుంటున్నారు. అందులో మీ గొప్ప హృదయం తెలుస్తోంది. అందుకే మిమ్మల్ని, మీ జెన్నీని చూడాలని, ఆ పాపని మీరెలా పెంచారో తెలుసుకోవాలని వచ్చాను" మనసులో మాట చెప్పి వూపిరి పీల్చుకున్నాను.



ఫోటో : పి.ఎన్.ఆర్., ఏలూరు

"కష్టపడ్డానన్న మాట నిజమే. కాని అందులో నా గొప్పతనం ఏమీ లేదు శాంతా. మానవ జన్మనెత్తాను. జీవితం సార్థకం చేసుకోవడానికి భగవంతుడు నాకో అవకాశం యిచ్చాడు. అది వదులుకోకూడదనుకున్నాను. అంతే. వృత్తిరీత్యా నేను నర్సుని. కాబట్టి పాప అనారోగ్యం, అవిటితనం నన్ను భయపెట్టలేదు" అంది క్రిస్టీనా.

"ఈ పాపని మీరు ఈ దేశం నించే తీసుకెళ్ళారన్నారు. నిజమేనా?"

"అవును పన్నెండేళ్ళ క్రితం. నేను మొదటిసారిగా ఇండియా వచ్చాను. దాదాపు పది మందిమి కలిసి ఒక బృందంగా వచ్చాం. ఢిల్లీ, ఆగ్రా, మధుర, బృందావనం చూశాక కలకత్తా వెళ్ళాం. తర్వాత డార్జిలింగ్‌లో నాలుగు రోజులుండి తిరిగి వస్తుంటే ఎవరో చెప్పారు కాశీ అనే ప్రదేశం హిందువులకి గొప్ప పుణ్యస్థలమని, చూడాల్సిన ప్రదేశమనీ. అదీ చూద్దామనీ బెనారస్ చేరుకున్నాం. అక్కడే నా స్నేహితురాలికి జబ్బు చేసింది. అపెండిసైటిస్. వెంటనే ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి. నేను నర్సుని కాబట్టి తనతో పాటు వుండిపోవలసి వచ్చింది. మిగతావాళ్ళు కోణార్క వెళ్ళారు. నేను పూర్తిగా హాస్పిటల్లోనే వుండిపోయాను. అప్పుడే చూశానీ పాపని. ఏడాది వయసుంటుంది. పోలియో అటాక్ అయినందువల్లనేమో సరిగ్గా ఎదుగుదల లేదు. ఆస్మాతో నానా అవస్థ పడుతోంది. ఊపిరి పీల్చలేక ఆయాసంతో రొప్పుతోంది. అందులో బాగా జ్వరం. స్నానం చేయించి ఎన్ని రోజులయిందో శరీరం అంతా మురికిపట్టి, జుట్టు అట్టలు కట్టిపోయింది. ఇవన్నిటికీ తోడు కంటికి గాయం. గడ్డ కట్టిన రక్తాన్ని కూడా నర్సులు సరిగ్గా శుభ్రపరచలేదు. గంగ వడ్డున వదిలేసి అనాథ అట. 'ఏ క్షణంలోనయినా చచ్చిపోతుందిలే' అని అనుకుంటున్నారు. నేను చూస్తూ వూర్కోలేకపోయాను. తీసుకొచ్చి మేము తీసుకున్న స్పెషల్ రూంలో పెట్టుకున్నాను. ముందు వళ్ళు శుభ్రం చేసి బట్టలు మార్చాను. జ్వరానికి మందులు తెప్పించి వేశాను. కంటికి బ్యాండేజీ వేశాను. ఏ పక్షో పొడిచినందువల్ల కన్ను గుడ్డిదయిందన్నాడు డాక్టరు. మరో రెండు రోజులకి జ్వరం తగ్గింది కాని పాప పుట్టుకతో చెవిటిదని తెలిసింది. అందుకే గంగ వడ్డున వదిలేసి వుంటారా తల్లిదండ్రులు. ఆ గవర్నమెంట్ హాస్పిటల్లో నర్సులు, డాక్టర్లు తీసుకెళ్ళి గంగలోనే పడేసేటట్లున్నారు. నాకా పాపని చూస్తే ముచ్చటేసింది. చావుతో పోరాడి గెల్చింది. ఎంత చేదు మందులైనా గుటుక్కున మింగేది. ఎన్ని



ఇంజెక్షన్లు చేసినా కిక్కురుమనేది కాదు. ఒంటి కంటితో జాలిగా చూసేదంతే. ఆ పాపని నేను దత్తత చేసుకుంటాననగానే అందరూ నన్నో పిచ్చిదాన్ని చూసినట్లు చూశారు. 'అనాథలే ఆరోగ్యంగా వున్న పాపలున్నారు చూపిస్తాం' అన్నారు. నేను వప్పుకోలేదు. వాళ్ళని ఎవరైనా పెంచుకుంటారు. లేదా వాళ్ళైనా బ్రతుకుతారు. జెన్నీని దత్తత చేసుకుని స్వీడన్ తీసుకెళ్ళిపోయాను. దాదాపు రెండేళ్ళు చాలా కష్టపడ్డాను. రాత్రీ, పగలూ శుశ్రూష చేశాను. పోలియోకి మందులతో పాటు వ్యాయామం చేయించాను. చెవికి ఆపరేషన్ చేయించడంతో వినగలిగింది. దాంతో మాట్లాడడం నేర్చుకుంది. మందులతో ఆస్మా తగ్గింది. పూర్తిగా ఆరోగ్యవంతురాలయిందని చెప్పలేను కాని చాలావరకు నయం అయింది. నేను నర్సుని కాబట్టి ఇవన్నీ చేయించడం నాకు సులభమే అయింది. ఇప్పుడు తన పనులన్నీ తనే చేసుకుంటుంది'' అంది క్రిస్టీనా.

''చదువు విషయం?'' అడిగాను.

''బాగా చదువుతుంది. వీళ్ళ కోసం స్పెషల్ స్కూల్సున్నాయి. వాళ్ళ క్లాసులో ఫస్టు. అదీ కాకుండా పెయింటింగ్ అంటే చాలా ఇష్టం. దానికి వేరే స్కూలుకి పంపుతున్నాను. చాలా బాగా పెయింట్ చేస్తుంది.''

''మీరు పెళ్ళి చేసుకోలేదా?'' అడిగాను ఆమె 'మిస్' అని చదవడం గుర్తొచ్చి.

''నన్ను ఇంటర్వ్యూ చేస్తున్నారే'' క్రిస్టీనా నవ్వింది. ''మా దేశంలో పెళ్ళికి పెద్ద ప్రాముఖ్యం లేదు శాంతా. పెళ్ళి చేసుకోకుండానే కలసి వుండొచ్చు. పిల్లల్ని కనొచ్చు. పిల్లల బాధ్యత మాత్రం ఇద్దరిదీ. ఏ కారణం వల్లనైనా జన్మనిచ్చిన వాడు పిల్లల పోషణ భారం వహించకపోతే ప్రభుత్వం అతడి మీద యాక్షన్ తీసుకుంటుంది. అదీ లేనప్పుడు ప్రభుత్వమే పిల్లల బాధ్యత తీసుకుంటుంది. పోషణకయే ఖర్చంతా భరిస్తుంది. ఇదివరలో నాకు చాలామంది మగ స్నేహితులుండేవారు. కాని పాపని దత్తత తీసుకున్నాక నా దృష్టి అటు మళ్ళలేదసలు. ఎవరూ జెన్నీ విషయంలో నాకు పూర్తిగా సహకరించరు. వాళ్ళ జాలి చూపులూ, సానుభూతీ కూడా నా జెన్నీకి అవసరం లేదు. జెన్నీ పెద్దదయింది కదా అందుకే మరో పాపని తీసుకెళదామని వచ్చాను.''

''కాని మళ్ళీ ఈ దేశానికే వచ్చారు. మళ్ళీ వికలాంగురాలైన అమ్మాయే కావాలనుకుంటున్నారని పుస్తకంలో రాశారు'' అడిగాను.

''చెప్పాగా శాంతా అక్కడ పిల్లల బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే వహిస్తుందని. వాళ్ళను పెంచుకోవాల్సిన అవసరం లేదు.''

అర్థం చేసుకున్నాను. ఇక్కడ ప్రభుత్వానికే కాదు కొందరు తల్లిదండ్రులకే ఇలాంటి పిల్లలు అవసరం లేదు.

''గుడ్‌మార్నింగ్ మమ్మీ'' వినసొంపుగా వుందా స్వరం. తలతిప్పి చూశాను. అప్పటికే స్నానం చేసి నీట్‌గా తయారయివచ్చింది. రంగు కాస్త తక్కువే గాని ముఖం కళగా వుంది. రింగులు తిరిగిన జుట్టుని పోనీటెయిల్ కట్టుకుంది. లేచాక ఎంత తిట్టినా గంటవరకూ ముఖమైనా కడుక్కోని నా చిన్నకూతురు గుర్తొచ్చింది.

జెన్నీ నడిచి వస్తుంటె చూశాను కాళ్ళకు వేసుకున్న పట్టీ బూట్లని. కొద్దిగా ఈడుస్తూ నడుస్తోంది. ఎడమకన్ను సగం మూసుకుపోయి నిర్జీవంగా కనిపిస్తోంది. చెవిలో మెషీన్ వుంది.

''గుడ్‌మార్నింగ్ బేబీ'' క్రిస్టీనా పాపని దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకుంది. పక్కన కూర్చోపెట్టుకుంది. ఆమె ప్రతి చేష్టలో మాతృప్రేమ, మమత ప్రతిబింబిస్తున్నాయి.

''ఆంటీ తెలుగు వాళ్ళటమ్మా. నమస్కారం చెప్పు'' అంది క్రిస్టీనా.

''రెండు చేతులూ జోడించి'' నమస్కారం ఆంటీ, మీ పేరేమిటి?'' అంది జెన్నీ తెలుగులో. నా కంటనీరు తిరిగింది. ఎంత శ్రమపడినా ఆరోగ్యవంతులయిన నా పిల్లల్లో ఇలాంటి క్రమశిక్షణ అలవర్చలేకపోయాను.


''నా పేరు శాంత. గాడ్ బ్లెస్ యు జెన్నీ''. అన్నాను. అంతకంటె ఏం మాట్లాడాలో తెలియడం లేదు.

''ఆంటీకి నువ్వు వేసిన బొమ్మలు చూపించమ్మా'' అంది క్రిస్టీనా.


జెన్నీ ఉత్సాహంగా లేచి లోపలి గదిలోకెళ్ళింది.

''వికలాంగులను పెంచడానికి కావలసింది ఓపికా, ధైర్యమూ శాంతా. మీ ఎదురింటి వాళ్ళకు చెప్పు. భగవంతుడు ఈ పిల్లలకు చేసిన అన్యాయానికి బాధపడి మరోకరకంగా వాళ్ళకు నిగూఢమయిన శక్తులిస్తాడు. ఆ 'హిడెన్ టాలెంట్'ని గుర్తించి వాళ్ళను ఆ రంగంలో ప్రోత్సహించాలి. ముఖ్యంగా కావలసినదేమిటంటే తల్లి తండ్రులే తమ దురదృష్టానికి అహర్నిశలూ విచారిస్తూ కూర్చోకూడదు. వాళ్ళే అలా చేసినప్పుడు పిల్లల్లో సెల్ఫ్ పిటీ మొదలవుతుంది. అదే వాళ్ళను మరింత బలహీనపరుస్తుంది. క్రిస్టీనా చెప్పుకుపోతోంది. ''నేను తొమ్మిది నెలలు కష్టపడి మోసి బిడ్డలను కనలేదు శాంతా. కాని మాతృప్రేమని పంచడానికి సొంత బిడ్డలే కానవసరం లేదు. ఆప్యాయతను, అనురాగాన్ని పంచి ఇవ్వడం స్త్రీలలో సహజగుణం. ప్రతి స్త్రీ తనలోని ఈ మమతను, తన పరాయి అన్న భేదం లేకుండా పిల్లలకు పంచి ఇవ్వగలిగితే భావితరాల పౌరులు వసుధైక కుటుంబాన్ని ఏర్పరుస్తారు.''

నాతోపాటు లక్షలాది మంది తల్లులు వినవలసిన పాఠం పెళ్ళికాని, పిల్లల్ని కనని ఓ మాతృమూర్తి చెప్తోంది. మాతృత్వానికి అర్హత పెళ్ళి, భర్తా కాదని, మమతను పంచే హృదయం మాత్రమేనని నిరూపిస్తోంది. నాకు గొంతెత్తి అరవాలనిపిస్తోంది.



మాతృస్థానానికి, మాతృ ప్రేమకు అత్యున్నత స్థానాన్నిచ్చిన గొప్ప మతం మాది. ప్రపంచంలో ఏ దేశంలోనూ తల్లీబిడ్డల అనుబంధం ఇంత ఉన్నత స్థాయిలో వుండదని గర్వించే జాతి మాది. బిడ్డను కనలేని స్త్రీకి గొడ్రాలని బిరుదునిచ్చి ఆమె జీవితం వ్యర్థం అని నిరూపించే గొప్ప సంప్రదాయం మాది. తలకొరివి పెట్టడానికి కొడుకే కావాలని, పుట్టిన ఆడపిల్లలను కించపరిచి మరో తల్లి కన్న మగబిడ్డను దత్తత చేసుకుని సంతృప్తిపడే గొప్ప ఆచారం మాది. ఇప్పుడింకా ఎదిగి పోతున్నాం. బిడ్డ కడుపులో వుండగానే ఆడో, మగో తేల్చుకుని ఆడబిడ్డ అయితే కడుపులోనే కోసి పారేస్తున్న గొప్ప అభ్యుదయం మాది. ఆడపిల్ల పుడితే ఏడ్చి, అవసరం లేదని గొంతు పిసికి చంపో, అనాథాశ్రమాల వరండాల్లోనో, మున్సిపాలిటీ చెత్తకుండీల్లోనో వదిలేసి పీడ వదిలించుకుంటున్న గొప్ప నాగరికత మాది. మాకు చదువుల దేవత ఒక స్త్రీ, ధనానికి అధిపతి మరొక స్త్రీ. కాని కన్నబిడ్డల్లో పుత్రుడికి మాత్రం ఆధిపత్యం ఇచ్చి చదువులోనూ, ఆస్తిలోనూ చివరకు పెట్టే తిండిలోనూ వివక్షత చూపించి ఆడపిల్లలను కించపరిచే సంస్కృతి మాది. ఆడ పిల్లకు పెళ్ళే ముఖ్యం. ఏదో రకంగా ఎంతో కొంత ఇచ్చుకుని పెళ్ళి చేసి వదిలించుకుంటే చాలని భావించే అభ్యుదయం మాది. మా మాతృ మూర్తులు కేవలం తాము కన్న బిడ్డల్నే ప్రేమిస్తారు. అందుకే కోడళ్ళను చంపో, ఆత్మహత్య చేసుకునేలా చేసో తమ అహాన్ని తృప్తిపరుచు కుంటారు. 'ఈ దేశంలో స్త్రీని పూజిస్తాం' అని గర్వంగా పైకి ఎలుగెత్తి చాటుతూ, మమ్మల్ని మేము వంచించుకుంటూ, ఎదుటివారిని వంచిస్తూ తృప్తిపడతాం. మాకున్న




అనాథ గ్రామాల్లో ఎక్కువగా ఆడపిల్లలే వుంటారు. ఓ పూట తిండి కోసం ఒక రాత్రంతా మగవాడికి సుఖాన్నిచ్చే ముక్కుపచ్చలారని ఆడపిల్లలు లక్షల్లో వుంటారు. పిల్లల్ని కన్న తల్లిదండ్రులే మరో అమ్మ కన్న పాపని ఎత్తుకొచ్చి వేశ్యావాటికల్లో అమ్మేస్తారు. పిల్లల్ని కన్న మరో మాతృమూర్తి వాళ్ళచేత బలవంతంగా పడుపువృత్తి చేయిస్తుంది. మా దేశంలో వికలాంగులైన పిల్లలు తమ అవిటితనాన్ని రోడ్ల మీద బహిర్గతం చేస్తూ, పదిమంది సానుభూతిని అర్థించి, డబ్బు సంపాదించి తల్లిదండ్రుల్ని పోషిస్తారు. ఆరోగ్యవంతులైన పిల్లల్ని కూడా వికలాంగులుగా మార్చి, దొంగలుగా చేసి పెట్టుబడిగా వాడుకోగల గొప్ప సంస్కృతి మాది.

ఎందుకు కంటున్నామో తెలియకుండా పిల్లల్ని కంటున్న మాతృమూర్తుల్లారా!

జనాభా పెరిగితే ఓట్లు పెరుగుతాయనే ఈక్వేషన్ మాత్రమే తెలిసిన రాజకీయ నాయకుల్లారా!!

మా సంస్కృతి, సభ్యత అతి గొప్పవి. స్త్రీని పూజించే పుణ్యభూమి మాదని ఎలుగెత్తి చాటే సంప్రదాయ వాదుల్లారా!!!

ఈ దేశానికీ, ఈ జాతికీ చెందని ఈ స్త్రీ దగ్గర మమత అంటే ఏమిటో తెలుసుకోండి. మాతృత్వానికి భాష్యం నేర్చుకోండి.


"ఆంటీ" జెన్నీ పిలుపుకి ఈ లోకంలోకి వచ్చాను. తను వేసిన బొమ్మల ఆల్బం పట్టుకొచ్చింది. పక్కన కూర్చుని ఒక్కొక్కటే చూపించి దాని గురించి చెప్తోంది. చాలావరకు ప్రకృతి దృశ్యాలే. ఆ చిన్న వయసులో ఆ ఒక్క కంటికే కనిపించిన ప్రకృతి రామణీయకతను సజీవంగా చిత్రీకరించగలిగింది.

"ఇవి రెండూ ఇండియా గురించి వేసినవి" రెండు చిత్రాలు చూపించింది. ఒకటి స్నేహా పిల్లలతో ఆడుకుంటున్న దృశ్యం. రెండోది తల్లి వడిలో పడుకుని చిరునవ్వులు చిందిస్తున్న పాపాయిది. ఆ తల్లి చీర కట్టుకుంది. మెడలో మంగళసూత్రాలు, నల్లపూసలు. పాప వాటితో ఆడుకుంటున్నది. జెన్నీని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకోకుండా వుండలేకపోయాను.

"ఒకసారి మీ బాత్రూం వాడుకోవచ్చా?" అడిగాను.

"ఓ ష్యూర్" క్రిస్టీనా లోపలకు తీసుకెళ్ళింది. పక్క గదిలో ఎదురుగా ఒక ఫోటో. జెన్నీ ఏడాది వయసులో వున్నప్పటిది. బహుశా క్రిస్టీనా దత్తత తీసుకున్నప్పటిదయి వుండొచ్చు.

బాత్రూంలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాను. పంపు పూర్తిగా తిప్పాను. ఆ చప్పుడులో బయటకు వినిపించదని నమ్మకం కలిగాక రెండు చేతులతో ముఖం కప్పుకున్నాను. అణువు చీలితే విస్ఫోటనం, గుండె పగిలితే రుధిరం ఉద్వేగాన్ని గుండెలో అణిచిపెట్టి చిరునవ్వుల మేకప్ వేస్తే — చిలిపి ఆత్మ కొంటె కంటకంతో కెలికి చెలగాటం ఆడుకుంది. చిరునవ్వు చెరిగిపోయింది. బద్దలయిన హృదయాన్ని నిశ్శబ్దపు ముసుగులో బంధించి, ప్రవహిస్తున్న రుధిరాన్ని రంగు తుడిచేసి కళ్ళ నిండి నిష్క్రమింపచేయడంలో విజయం సాధించాను. గతించిన కాలం కళ్ళ ముందు పైశాచిక నృత్యం చేస్తోంది. కాలానికి కళ్ళెం వేయలేను. గుండె వాకిట చల్లిన కెంపు కళ్ళాపిపై అందంగా రంగవల్లులిక అల్లలేను. ఇన్నాళ్ళూ ఈ జగతి నా ముంగిట ముగ్గులు చూసి 'ఎంత అందమైన ఇల్లో' అనుకుంటుంది. కాని ఈ రోజు నా గుండె తలుపుల్ని తెరుస్తాను. ఇన్నాళ్ళూ బంధించబడ్డ చేదు నిజం ఎంత కుళ్ళు



కంపుకొడుతోందో మీ ముందు బయటపెట్టు కుంటాను. నన్ను అసహ్యించుకుని పారిపోయే ముందు ఒక చిన్న విన్నపం. నా పరిస్థితిని మీరైనా అర్థం చేసుకోండి. ఆత్మశాంతి లేక పిశాచమై తిరుగుతున్న నా గతానికి గొంతైనా నిష్కృతి కలగనివ్వండి.

పన్నెండేళ్ళ క్రితం చచ్చిపోయిందనుకున్న కన్నబిడ్డ ప్రాణాలతో ఎదురుపడితే అపరిచితు రాలిగా నటించి, దుఃఖాన్ని పైకి రానివ్వకుండా అదిమిపెట్టి, నవ్వుతూ మాట్లాడి గొప్ప నటి నయ్యాను. కాని నాలో ఆవేదన, బాధ, గిల్ట్ అన్నీ కన్నీళ్ళ రూపంలో మీ ముందు ప్రవహించ నివ్వండి.

ఇద్దరు ఆడపిల్లల తర్వాత ఎంతో ఆశతో ఎదురుచూసినా మూడో బిడ్డ కూడా ఆడపిల్లే కావడం అందర్నీ బాధపెట్టింది. మనవడిని చూడాలన్న అత్తగారి రుసరుసలు ఎక్కు వయ్యాయి. దానికి తగ్గట్టుగా పుట్టినప్పటి నించి పాపకి అనారోగ్యమే. మందులు, తాహతుకి మించిన ఖర్చులు. భర్త చిరాకు. 'దీన్నెందుకు పుట్టించావురా' అని భగవంతుడిని రోజూ తిట్టు కోవడమే. శ్రద్ధ తీసుకోక పోలియో ఎఫెక్టు. ఆ దుఃఖంలో వుండగానే రిట్రెంచిమెంట్‌లో భర్త ఉద్యోగం పోవడం. 'ఇది పుట్టిన వేళావిశేషం' అని అందరి ఈసడింపు! అదీ నిజమేనన్నట్లు ఆరో గ్యంగా వున్న మామగారి అకాల మరణం. ఆ బాధ నించి తేరుకోక ముందే పాప చెవిటి, మూగ అని డాక్టర్ చెప్పడం, ఇంటిల్లిపాదీ ఏడుపులు. ఎవరి మీదో తెలియని కసి, దాన్ని గొంతు నులిమి చంపేయాలన్నంత కోపం.

ఆ రోజు నాకింకా బాగా గుర్తు. మామగారి చివరి కోరికపై ఆయన అస్థికలు గంగలో కలప డానికి వెళ్ళాం. ఉదయం కార్యక్రమం ముగి సింది. రాత్రి తిరుగు ప్రయాణం. సాయంత్రం ఉన్నట్లుండి పాపకి బాగా జ్వరం, ఆస్త్మా ఎటాక్ వచ్చాయి. కళ్ళు తేలేసింది. దగ్గరలో ఏదో హాస్పి టల్ వుందని, చూపించి తీసుకొస్తానని తీసు కెళ్ళారాయన. దాని అనారోగ్యంతో అప్పటికే విసుగెత్తిపోయిన నేను సామాను సర్దడంలో మునిగి పోయాను. రైలుకి ఇంకో గంట టైముందనగా వట్టి చేతులతో తిరిగి వచ్చారాయన.

"డాక్టర్లు చాలా ప్రయత్నం చేశారు. కాని లాభం లేదన్నారు. గంటో, రెండు గంటలో బతికితే గొప్ప అన్నారు. అడ్మిట్ చేసుకోలేదు. తీసుకెళ్ళిపొమ్మన్నారు" అన్నారు.


"మరి పాపేది?" అడిగాను.




"గంగ వద్దున వదిలేసి వచ్చాను" అన్నారు నిర్లిప్తంగా.

"అదేమిటి — బతికుండగానే?" భయంగా అన్నాను.

"శాంతా, ఆ బిడ్డ భారాన్ని మనం మోయ లేం. ఈ ఒక్క బిడ్డ గురించి మిగతా ఇద్దరికీ చాలా అన్యాయం చేస్తున్నాం. దీని మందుల ఖర్చుతో వాళ్ళిద్దరికీ కనీసం కడుపు నిండా తిండైనా పెట్టగలం. ఒక్కసారి ఆలోచించు శాంతా. అసలే ఆడపిల్ల. అవిటిది, చెవిటి, మూగ. దానికి చదువు చెప్పించలేం. కట్నాలిచ్చి పెళ్ళి చేయలేం. మన తర్వాత అది మిగతా వాళ్ళకు భారమవుతుంది. బతికుండి రోజు రోజు చచ్చే కంటె అదిలా ఒక్కసారే చచ్చిపోవడం నయం కదా. డాక్టర్లు గంటలన్నారు. పవిత్రమైన గంగా నది వద్దున దాని ప్రాణం ఇప్పటికే పోయుం టుంది. దాన్ని ఎదురుగా పెట్టుకుని క్షణాలు లెక్కపెట్టుకుంటూ, చావుకి ఎదురుచూడడం మనవల్ల కాదు. లే, లేచి స్నానం చెయ్యి. రైలు టైమవుతోంది" అన్నారు.




మనం ఎక్కవలసిన రైలు జీవితకాలం లేటన్నాడు కవి. టైముకి వచ్చే రైలు తప్పిపోకూడదని ఒక ప్రాణిని బలి చేసిన దుస్థితి.

నేను తల బాదుకుని ఏడవలేదు. ఎందుకిలా చేశారని నిలదియ్యలేదు. దాన్ని వెతుక్కుంటూ వెళ్ళలేదు. ఆ చేదు నిజాన్ని జీర్ణం చేసుకున్నాను. దారిద్ర్యం మమతనూ, మానవత్వాన్ని కూడా జయించింది. నా కడుపుకోత కంటె నేను కన్న మరో ఇద్దరి పసివాళ్ళ ఆకలి బాధ ముఖ్యమనిపించింది. కన్నబిడ్డను చావుకి వదిలి తల్లిగా ఆ క్షణానే నేను చచ్చిపోయాను.

తలారా స్నానం చేశాను. ఆ బిడ్డ జ్ఞాపకాలను కూడా కాశీలో వదలి, ఇల్లు చేరుకున్నాం. పాప చనిపోయిందని చెప్పాం. నెల తిరిగేసరికల్లా మా వారికి మళ్ళీ ఉద్యోగం వచ్చింది. "అది పోయింది, శని కూడా పోయింది" అన్నారంతా. నా గుండెల్లో రంపపుకోత. కాని పెదవి దాటలేదు. చేసిన తప్పుని పరిస్థితుల ప్రాబల్యం అని సరిపెట్టు కుని ఆత్మవంచనతో తృప్తిపడాల్సిన లోయర్ మిడిల్ క్లాసు గృహిణిని.

నాకు మళ్ళీ గర్భం వచ్చింది. నాలో భయం. చేసిన పాపానికి భగవంతుడు ఎలాంటి శిక్ష వేయబోతున్నాడోనని. అదృష్టవశాత్తూ పుట్టింది బాబు. అందంగా, ఆరోగ్యంగా వున్నాడు. తప్పు చేశామేమోనన్న భావం మాలో తగ్గింది. భగవంతుడు కూడా మమ్మల్ని క్షమించాడనుకున్నాం.

వారం రోజుల క్రితం ఎవరింటికో వెళ్ళినప్పుడు యాదృచ్ఛికంగా ఒక పత్రికలో క్రిస్టినా ఇంటర్వ్యూ చదివాను. నాలో ఏదో అనుమానం. ఆలోచించి చూస్తే తేదీలు కూడా సరిగ్గా సరిపోయాయి.

అప్పటినించీ నాలో అంతర్మథనం - ఇప్పుడేం చెయ్యాలి! నా భర్తకు చెప్పాలనుకున్నాను. కాని వివేకం నన్నాపని చేయనివ్వలేదు. చెప్పినా ఏం చేస్తాడు? చేసిన తప్పుని పదిమందిలో ఒప్పుకుని పాపని ఇమ్మని అడుగుతాడా? లేదు. మా ఆర్థిక పరిస్థితి అలాంటి అవకాశాన్నివ్వదు. 'ఎక్కడో ఓ చోట సంతోషంగా వుంది చాల్లెద్దూ' అంటాడు. ఎవరికైనా తెలుస్తుందేమోనని భయపడతాడు కూడా. ఆలోచించినకొద్దీ నాకొక్కటే అనిపించింది. క్రిస్టినాను ఆ పాపనీ చూడాలి. మాతృప్రేమ పెల్లుబికీ కాదు, కన్న కడుపు ఆక్రోశంతోటీ కాదు. ఆమె సుఖంగా వుందని చూసి తృప్తి పడటం కోసం అంతకంటె కాదు. కన్నబిడ్డ కాళ్ళు పట్టుకుని 'తల్లీ నన్ను క్షమించు

అనడిగే ధైర్యం లేదు 'అమ్మా, ఈ బిడ్డ నా బిడ్డ. నేను మృత్యుదేవతకి ఆహారంగా వేస్తే కాపాడి ప్రాణం పోసిన దేవతవు. నా కన్నీటితో నీ కాళ్ళు కడిగి పాపప్రక్షాళనం చేసుకోనివ్వు' అని క్రిస్టీనాను వేడుకోడానికీ కాదు. ఏ పరిస్థితులలో మేమా పని చేశామో తెలుస్తే వాళ్ళు అర్థం చేసుకుని మమ్మల్ని క్షమించవచ్చు. ఆ రకంగా నా పాపానికి కొంత నిష్కృతి లభిస్తుంది కూడా. కాని అలా జరక్కూడదు. క్రిస్టీనా, జెన్నీలను క్షమాపణ కోరకుండా నేను చేస్తున్న ఈ నేరం తెలిసి చేస్తున్న మరొక పాపం. ఆ నేరం నాకు ప్రతిరోజూ గుర్తు రావాలి. ఎవరికీ ఏమీ చెప్పుకోలేక నేను కుళ్ళి కుళ్ళి ఏడ్చుకోవాలి. నాలోని ఈ రహస్యం నన్ను చిత్రవధ చేస్తుండాలి.

కన్నీటి ఛాయల్ని చన్నీళ్ళతో కడిగి చిరునవ్వు పులుముకుని బయటకు వచ్చాను. ఇక సెలవు తీసుకోవడం మంచిదనిపించింది.

"వెళ్ళొస్తాను. నమస్తే" చేతులు జోడించి చెప్పాను క్రిస్టీనాతో. జెన్నీ నేను తెచ్చిన ఏనుగు అంబారీ తీసి చిత్రం గీస్తోందప్పుడే. వెళ్ళి నుదుటి మీద ముద్దుపెట్టుకున్నాను. చిన్నగా నవ్వింది.

తలుపు వైపు అడుగులు వేశాను.

"అమ్మా"

నా రహస్యం బయటపడిందా? నా గుండెల్ని ఎవరో పిండుతున్నంత బాధ. ఏమిటీ పిలుపు? వద్దు నాకా అర్హత లేదు. నన్నెవరూ క్షమించవద్దు.

జెన్నీ దగ్గరగా వచ్చి నా చేతిలో ఒక ప్యాకెట్టు ంచింది. క్రిస్టీనా నవ్వుతూ చూస్తోంది.

"ఏమిటిది?" అడిగాను.

"ఏమీ లేదు. మా తరపున చిన్న కానుక. మన పరిచయానికి గుర్తుగా తీసుకెళ్ళండి. మీ పిల్లలకివ్వండి" అంది క్రిస్టీనా. "థాంక్స్" చెప్పి కదిలాను.

శ్రీను నా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాడు. నన్ను చూడగానే అతడి ముఖంలో రిలీఫ్ కనిపించింది. వెళ్ళేటప్పుడు నాలో వున్న టెన్షన్ ఇప్పుడు లేదు. వ్యధ అంతా తిరిగి గుండెల్లో నిక్షిప్తమైపోయింది.

మర్నాడు విశాఖపట్టణం ట్రైనెక్కాను. మళ్ళీ ఒంటరితనం. కళ్ళముందు ఒకటే దృశ్యం. కాళ్ళు కదల్చలేని నిస్సహాయ స్థితిలో, వాళ్ళు జ్వరంతో పేలిపోతున్న పసిపాప. ఆయాసంతో రొప్పుతూ, అమ్మ ఒడి కోసం పరితపిస్తూ, నోటితో చెప్పలేక చేతులతో రా రమ్మని సైగలు చేస్తూ కొట్టుకుంటుంటే- మీద వాలిన రాబందు చాలాకాలానికి దొరికిన సజీవాహారాన్ని లొట్టలు



వేసుకుంటూ తినడానికి ఉపక్రమిస్తుంటే - బాధతో, భయంతో ఉక్కిరిబిక్కిరవుతూ ఆ చిన్ని ప్రాణం అమ్మ కోసం ఆరాటపడుతూ రక్షించమని వేడుకుంటూ... కంటి మీద పొడవగానే అది పెట్టిన చావు కేక బహుశా నేను పారిపోతున్న రైలు కూతలో కలసిపోయుంటుంది. జీవితంలో విషాదాన్ని కూడా సినిమాటిక్‌గా రంగుల్లో వూహించగలిగే అధమస్థితికి దిగజారిన మాతృత్వం.

గుండె దిటవు పరుచుకుని ఆలోచనలను మళ్ళించాలనే ప్రయత్నంలో జెన్నీ ఇచ్చిన ప్యాకెట్టుని విప్పాను. పిల్లలకోసం వాచీలు, కొన్ని ఎలక్ట్రానిక్ ఆటవస్తువులు వున్నాయి. జీవితంలో నాకు నేనుగా వాళ్ళకు కొనివ్వలేని వస్తువులు. కంటనీరు తిరిగింది. ఎవరూ చూడకుండా తుడిచేశాను.

మరో పెద్ద కవర్ తెరిచాను. జెన్నీ వేసిన తల్లీబిడ్డల చిత్రం, నా పాపాన్ని పరిహసిస్తున్నట్టుగా. అవును దీన్ని చూస్తుంటే నా తప్పుని ప్రతిక్షణం ఇది గుర్తు చేస్తుంది; చెయ్యాలి కూడా. నేను వేసిన మరణదండనని చిరునవ్వుతో స్వీకరిస్తూ నా చిట్టితల్లి నాకిచ్చిన బహుమానం.

చిత్రాన్ని తిరిగి కవర్‌లో పెట్టబోతుంటే ఉత్తరం కనిపించింది. తీసి చూశాను. టైప్ చేసి వుంది.

* * *

శాంతా,

నువ్వు ఆంధ్రానించి వచ్చావనగానే అనుమానం వచ్చింది. జెన్నీ దొరికినప్పుడు మెడలో దొరికిన తాయెత్తు చూసి మా తెలుగు డాక్టర్ 'ఇది తెలుగు లిపి. పాప తెలుగమ్మాయి కావచ్చు' అన్నాడు. అందుకే జెన్నీకి తెలుగు నేర్పించాను.

ఈ పాప నీదని అడగడానికి వచ్చావేమోననే ఆలోచన నన్ను భయభ్రాంతురాలిని చేసింది. కాని మాకు నిజం తెలియకూడదని నువ్వు చేసిన ప్రయత్నం హర్షణీయం. ఏ తల్లీ కన్నబిడ్డను చూడగానే అలా నిర్లిప్తంగా కూర్చోలేదు. మా ఇద్దరి మధ్యా అనుబంధాన్ని కలుషితం చేయకూడదని ఎంత కష్టపడ్డావో, మథనపడ్డావో చూస్తుంటే ఆశ్చర్యం వేసింది. నా అనుమానం నివృత్తి చేసుకోవడానికి పాప చిన్నప్పటి ఫోటో ఎదురుగా పెట్టాను. అది చూడగానే నీ ముఖంలో క్షణంపాటైనా కదిలిన విచారరేఖలు నిన్ను పట్టించేశాయి. నీ సంస్కారానికి నా జోహార్లు.

మనిషి పరిస్థితులకు బానిస. దేశకాల పరిస్థితులు, సమాజపు రీతి రివాజులు చెయ్యకూడని పనులు చేయిస్తాయి. జరిగినదానికి ఎన్నడూ విచారించకు. జరిగేదంతా మన మంచికే అని మీరే అంటారుగా. నువ్వు చేసిన ఆ పనివల్ల నాలాంటి అనాథకు, అభాగ్యురాలికి చక్కటి ఆసరా దొరికింది. జీవితం ఆనందమయం చేసుకునే మార్గం దొరికింది. నీకు నా మనఃపూర్వక కృతజ్ఞతలు. నాది ఒక్క కోరిక. నువ్వు ఆర్థికంగా, పేదరాలివే కావచ్చు. కాని ఇలాంటి బిడ్డలకు పదిమందికి పంచిపెట్టగల మమత, మంచితనం నీలో వున్నాయి. నువ్వు చెప్పిన మీ ఎదురింటి అబ్బాయి కథ నిజమే అయితే - నీ ప్రేమను ఆ బిడ్డకు పంచడంతో మొదలుపెట్టు. అలాంటి పిల్లలకు సేవ చేయడంలో వున్న తృప్తి నీలో గిల్టీ ఫీలింగ్‌ని పోగొడుతుంది. కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది.

నీ భవిష్యత్తు సుఖమయం కావాలని కోరుకుంటూ-

— క్రిస్టీనా

నన్ను క్షమించడమే కాకుండా ఓ త్యాగమయిని చేసి క్రిస్టీనా కావలసినదానికంటే పెద్ద శిక్షే వేసింది. నాకు దుఃఖం ముంచుకొచ్చింది. ఈసారి అది దాచుకునే ప్రయత్నం ఏమాత్రం చెయ్యలేదు. చుట్టూ కూర్చున్నవాళ్ళంతా నావైపు కుతూహలంగా, భయంగా చూస్తున్నారు. నా కన్నీరు ప్రవాహంలా సాగిపోతూనే వుంది. క్రిస్టీనా చెప్పిన మార్గం అనుసరించడం మొదలుపెట్టేవరకు బహుశా అదలా సాగిపోతూనే వుంటుంది. ●